రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

నాగోలు: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శ్రీ చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ బొప్పన రూనీ లక్ష్మీబాయి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ఎల్‌బీనగర్ జోనల్ క్యాంపస్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని డీసీపీ ప్రవీణ్ కుమార్, బుల్లితెర నటి స్వర్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉన్న వారు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డివిజన్ ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్, పాల్గొన్నారు.

అధికారుల సమన్వయం లేక ప్రజలకు ఇక్కట్లు



కాలనీవాసులతో కలిసి రహదారిని పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: అభివృద్ధి పేరుతో జీహెచ్‌ఎంసీ, ఆర్‌అండ్‌బీ, జలమండలి శాఖల అధికారుల మధ్య సమన్వయం లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ పరిధి గణేష్‌నగర్‌కాలనీలో బుధవారం ఆయన కాలనీవాసులతో కలిసి పర్యటించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. విజయవాడ జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా పరసర కాలనీల డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్నదని, కాలనీలోని రోడ్లు మురికి కుంటలుగా మారాయని, తాగునీరు డ్రైనేజీ మురుగుతో కలుషితం అవుతుందన్నారు. జాతీయ రహదారి ఎత్తు పెరగడంతో కాలనీల అంతర్గత రోడ్లు కిందికి అయ్యాయని, రోడ్డు ఎక్కేందుకు కాలనీలవాసులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆయా శాఖల అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకుంటే వివిధ కాలనీవాసులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో మురళీధర్, రమేష్, సుధాకర్,ఘనచారి, రఘుపతి, శ్రీధర్‌రెడ్డి అప్పలరాజు, సతీష్‌చంద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జెడ్సీకి వినతి



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్ అన్నారు. బుధవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని హస్తినాపురం నార్త్ ఎక్స్ టెన్షన్ కాలనీలో నిర్వహించిన కులగణన సర్వేకు వచ్చిన జోనల్ కమిషనర్‌కు కాలనీలో ఉన్న పార్కులో చెత్తా చెదారం పేరుకుపోయిందని తరలించేలా చర్యలు తీసుకోవాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌యాదవ్ వినతిపత్రం అందజేశారు. ఆయా శాఖల అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జెడ్సీ హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాతానాయక్, డీసీ ఇస్లావత్, కాలనీ ప్రతినిధులు తులసీరామ్‌నాయక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందజేత



పురస్కారం అందుకుంటున్న రాజేష్

దిల్‌సుఖ్‌నగర్: చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో నిర్వహించిన యువ ఆర్ట్ థియేటర్ 21 వ వార్షికోత్సవంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యా, వైద్య, తదితర రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖులకు అవార్డులతో సన్మానించారు. ఆర్‌కేపురం చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు సేవా భూషణ్ పురస్కారాన్ని కేంద్ర మాజీ మంత్రి డా. సముద్రాల వేణుగోపాలచారి అందజేశారు. ఈ సందర్భంగా యువ ఆర్ట్ థియేటర్ అధ్యక్షులు డా.బి ఆర్ వెంకటరమణ మాట్లాడుతూ.. అనాథ విద్యార్థి గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ తమ విద్యార్థులకు అత్యాధునిక వసతి, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, భోజన సౌకర్యాలు, ప్రైవేట్ రంగంలో అద్భుత విద్యావకాశాలు కల్పించి వారిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్తున్నారని కొనియాడారు.

డ్రగ్స్, సైబర్‌నేర రహిత సమాజమే లక్ష్యం



అవగాహన సదస్సులో పాల్గొన్న ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్

నాగోలు: ప్రతి పౌరుడు డ్రగ్స్, సైబర్ నేర రహిత సమాజం నిర్మించడమే లక్ష్యంగా పని చేయాలని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య పిలుపునిచ్చారు. సైబర్ జాగృత్ దివస్ సందర్భంగా తట్టి అన్నారంలోని శ్రేయాస్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ఇన్‌స్పెక్టర్ సూర్యానాయక్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని సైబర్ నేరాలకు పాల్పడుతూ ఎంతో మందిని మోసాలకు గురి చేస్తున్నారని అలాంటి సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో వ్యవస్థలను ఏర్పాటు చేసిందన్నారు. ఆన్‌లైన్ యాప్స్ వాడుతున్న వారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ సాగర్, యజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థులు, నాగోలు పోలీస్ స్టేషన్ ఎస్ఐ సి.రమేష్ పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ సిస్టం మాయం

విచారణ చేపట్టాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టం విద్యుత్ స్తంభాలు కనిపించకుండా పోయాయని, ఎలాగైనా వాటి ఆచూకీ కనుగొనాలని మున్సిపల్ కమిషనర్ సరస్వతికి బుధవారం బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణపతి ఉత్సవాల సందర్భంగా మెయిన్ రోడ్డుపై ఉన్న సెంట్రల్ లైటింగ్ సిస్టం విద్యుత్ స్తంభాలు తీసివేశారని, పండుగ పూర్తయిన వెంటనే తిరిగి ఆయా స్థానాల్లో వాటిని ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ.. ఇప్పటికి వాటి ఊసేలేదన్నారు. సెంట్రల్ లైటింగ్ సిస్టం సంబంధిత కాంట్రాక్టర్ అమ్మేసుకున్నాడని ఆరోపించారు. వీటితో పాటు శివనారాయణపురం కాలనీలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభాలను కూడా మాయం చేశారన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి, దోషులను గుర్తించి చర్యలు తీసుకొని సెంట్రల్ లైటింగ్ సిస్టంను తిరిగి అమర్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కుటుంబ సర్వేకు సహకరించాలి



తన ఇంటికి సర్వే స్టిక్కర్ వేస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి



సమగ్ర సర్వే తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కార్పొరేటర్‌కు సర్వే ప్రక్రియ వివరిస్తున్న అధికారులు

హస్తినాపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. బుధవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని తుల్జాభవానినగర్‌కాలనీలో ప్రారంభమైన కులగణన సర్వే కార్యక్రమంలో ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌పాటిల్, డీసీ సేవ ఇస్లావత్‌తో కలిసి కార్పొరేటర్ సుజాతనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ కుటుంబ వివరాలు ఇవ్వాలన్నారు. అద్దెకు ఉంటున్న వారి వివరాలను కూడా చెప్పాలని ఇందులో ఎలాంటి దాపరికాలకు తావివ్వకుండా పూర్తి వివరాలు ఇవ్వాలన్నారు.

గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో..

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కోదండరాంనగర్ కాలనీ, సీసలబస్తీలలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే తీరును జీహెచ్‌ఎంసి ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ సుజాత, మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, స్థానిక నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీశైలంయాదవ్, రమేష్ ముదిరాజ్, యాదశంకర్, బైరశంకర్, విజయలక్ష్మి, వాణి, రాము విక్కి, కిరణ్ పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న జెడ్సీ హేమంత్ పాటిల్, డీసీ సేవ ఇస్లావత్

కృష్ణతులసినగర్‌లో..

మలక్‌పేట: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని కృష్ణతులసినగర్‌లో సమగ్ర సర్వే ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం అధికారులు డివిజన్ పరిధిలోని కృష్ణతులసినగర్‌లో కార్పొరేటర్ నివాసంలో ఆమెను కలిసి సర్వే ప్రక్రియను వివరించి ఇంటికి స్టికర్ వేయించారు.స్టికర్లు వేయడం పూర్తయిన తర్వాత సర్వే కొనసాగుతుందని మలక్‌పేట సర్కిల్ ఏఎంసీ మురళీ మోహన్ తెలిపారు.

ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో..

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభించి ఎన్యుమరేటర్లకు సర్వే సామగ్రిని అందజేశారు. ఎన్యుమరేటర్లకు కేటాయించిన కాలనీలకు వెళ్లి బుధవారం ఇంటింటికి స్టిక్కర్ వేశారు. మొదటి మూడు రోజులు పాటు ఇళ్లకు సిక్కర్లు వేసి జాబితా నమోదు చేస్తారు. కాలనీ పేర్లను ప్రత్యేక కోడ్ రూపంలో సేకరిస్తున్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో 9326, హయత్‌నగర్ సర్కిల్ 2850, సరూర్‌నగర్ సర్కిల్ 1529 ఇళ్లకు స్టిక్కర్లు వేసినట్లు అధికారులు తెలిపారు. కులగణన సర్వేకు ప్రజలకు సహకరించాలని కోరారు.

రైతు బజారులలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ. 29, వంకాయ రూ. 45, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ. 23–28, కాకర రూ. 35, బీర రూ. 18–35, క్యాబేజీ రూ. 33, ఫ్రెంచి బీన్స్ రూ. 65, క్యారెట్ రూ. 65, దొండ రూ. 28, చిక్కుడు రూ. 40–80, గోకర రూ. 40, బీట్‌రూట్ రూ. 50, క్యాప్సికం రూ. 75, ఆలు రూ. 37, దోస రూ. 40, సొర రూ. 15, పొట్ల రూ. 23, ఉల్లిగడ్డ రూ. 40, చామగడ్డ రూ. 40. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నియామకం



నియామకపత్రాన్ని అందుకుంటున్న మాధవి

మన్సూరాబాద్: అఖిల భారత పద్మశాలి సంఘం–పొలిటికల్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మన్సూరాబాద్‌కు చెందిన కర్నాటి మధవిని నియమించారు. జాతీయ అధ్యక్షుడు బొల్ల శివశంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మ ప్రవల్లిక నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, మహిళలు రాజకీయంగా ఎదగడానికి కృషి చేస్తానని అన్నారు.

మహిళపై అత్యాచారానికి పాల్పడ్డ దోషులను శిక్షించాలి

ముషీరాబాద్: మధురానగర్‌లోని ఓంనగర్‌లో 50 ఏళ్ల మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.పద్మ, వై.వరలక్ష్మి, సహాయ కార్యదర్శి కె.నాగలక్ష్మిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో బాలికలు, మహిళలపై రోజు రోజుకు అత్యాచారాలు పెరుగుతున్నాయని వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. నగరంలో విచ్చలవిడిగా బెల్టుషాపులలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని గంజాయి, మత్తు పదార్థాల వాడకాన్ని నిరోధించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలు.. 55 కేసులు నమోదు

చిక్కడపల్లి: చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తున్న 55మందిపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం తెలిపారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

దివ్యాంగులకు మెరుగైన సేవలు అందిస్తాం



సమావేశంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

వనస్థలిపురం: శ్రీనివాస కాలనీలోని శాంతినికేతన్ మానసిక వికలాంగుల పాఠశాలలో బుధవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీ-గార్డ్ సంస్థ సభ్యులు విద్యార్థులకు అవసరమైన ఆక్యుపేషనల్ థెరపీ, ఒకేషనల్ ట్రైనింగ్, ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీలను అందించడానికి తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఇతర ప్రాంతాలలోని విద్యార్థులు కూడా శాంతినికేతన్ పాఠశాలలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇలాంటి సేవలు అందిస్తున్న వీ-గార్డ్ సంస్థకు పాఠశాల కార్యదర్శి సీహెచ్.రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సనేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన



సభ్యత్వ నమోదు అందజేస్తున్న ఆనంద్‌గౌడ్, రాధా ధీరజ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, ఆర్.కె.పురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌లో బుధవారం బీబీఆర్ వేణు, బీజేపీ గీతా సెల్ కోకన్వీనర్ కిరణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో వారు పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు ముందుకొచ్చి స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకుంటున్నారని తెలిపారు. ఉపేందర్ రెడ్డి, రమేష్, ముంత రాములు, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, జనార్దన్,సైదయ్య, రాంప్రసాద్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



లబ్ధిదారులతో ఎమ్మెల్యే సబితారెడ్డి

- రూ.లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలి
- ఎమ్మెల్యే సబితారెడ్డి డిమాండ్
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

హుడాకాంప్లెక్స్: హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పిన మాటను నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. అధికారం చేపట్టి 11 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు అమలు చేయడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో తెచ్చిన కేసీఆర్ కిట్‌ను అందజేయాలన్నారు. 44 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉండగా.. 22 లక్షల మందికి చేసి, అందరికీ చేసినట్లు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తుల స్టేటస్ ఇప్పటివరకు చెప్పలేదన్నారు. కులగణనను పారదర్శకంగా చేయించాలని ప్రభుత్వానికి సూచించారు. అనంతరం గత ప్రభుత్వ హయాంలో సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్మించిన నూతన భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాధ, తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మురుకుంట్ల అరవింద్ శర్మ, పెండ్యాల నగేష్, లోకసాని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎం.ఏ.సాజిద్, రాంనర్సింహగౌడ్, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, ఋషి, స్వప్నారెడ్డి పాల్గొన్నారు.

సరూర్‌నగర్ చెరువు.. పర్యవేక్షణ కరువు

సరూర్‌నగర్ చెరువులో రోజురోజుకు చెత్త, వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. చెరువులో ఎటు చేసినా ప్లాస్టిక్ కవర్లు, చెత్త, చెట్లకొమ్మలే కన్పిస్తున్నాయి. సమీప కాలనీవాసులు తమ ఇళ్లలోని వ్యర్థాలను చెరువులో విసిరేస్తున్నారు. చెరువుపై పర్యవేక్షణ లేక కట్టపై తినుబండారాల వ్యాపారులు సైతం తమ వద్ద ఉన్న వ్యర్థాలనూ వేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సాయంత్రం సేదతీరేందుకు వస్తే దుర్వాసన వస్తోందని సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువులో వ్యర్థాలు వేయకుండా కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. –చైతన్యపురి



ఎఫ్‌సీఐ కాలనీ అభివృద్ధికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎఫ్‌సీఐ కాలనీలో ఆయన పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రోడ్లు, వీధి దీపాల సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని హైకోర్టుకాలనీలో పారిశుద్ధ్య కార్మికులు పనులు సరిగా చేయడం లేదని ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన కాలనీలో పర్యటించి పనులను పర్యవేక్షించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ యాదయ్య, సూపర్‌వైజర్ శ్రవణ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సన్మానం



నిత్యానందరావును సన్మానిస్తున్న రామచంద్రరావు

దిల్‌సుఖ్‌నగర్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆచార్య వెలుదండ నిత్యానందరావుకు బుధవారం ఎస్.ఆర్.ఆర్ ట్రస్ట్ చైర్మన్ ఎస్. రామచంద్రరావు ఆధ్వర్యంలో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ.. ఉన్నత విద్యాలో ఎంతో సేవలు అందించిన నిత్యానందరావును తెలుగు విశ్వ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా నియమించడం శుభ పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు, అల్లంపల్లి విజయకుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



మన్సూరాబాద్: రోడ్డును ఆక్రమించి చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని కాలనీవాసుల ఫిర్యాదుతో జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారు. జడ్జెస్‌కాలనీ ప్రధాన రోడ్డులో రోడ్డును ఆక్రమించి ఓ వ్యక్తి నిర్మాణం చేస్తున్నాడు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గమనించి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆన్‌లైన్‌లో, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్, హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఏసీపీ విజయశ్రీ సదరు నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎండీ అక్బర్, మహేందర్, సిబ్బంది పాషా పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: చిన్నారులు ఎదగడానికి వారికి హక్కులు ఎంతో ముఖ్యమైనవని చదువు, స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ హక్కులను కచ్చితంగా అమలు చేయాలని టీపీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో బాలల హక్కులు పరిరక్షణ పోస్టర్‌ను బుధవారం ఆయన తన నివాసంలో ఆవిష్కరించి మాట్లాడారు. చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలి సూచించారు. డ్రగ్స్, గంజాయి, కొకైన్ లాంటి మత్తు పదార్థాల మూలంగా యువత భవిష్యత్ అంధకారం అవుతుందని, వారిని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు.